# విధిచేయు వింతలెన్నో!

"ఇవాళ ఓ గంట పర్మిషన్ పెట్టి, ఇంటికి పెద్రాళే అఘోరించు!... పెళ్లి చూపుల కెడదాం!"

అద్దం ముందు నిలబడి, గిరిజాల జుట్టును మరోసారి వెనక్కి దువ్వుకుని, తల్లి అందించిన టిఫిన్ బాక్సను 'బ్రీఫ్'లో ఓ పక్కగా పెట్టుకుని – బ్యాంకుకి బయల్దేరబోతున్న సాగర్, తండ్రి మాటలు విని, చురుక్కున వెనక్కి చూశాడు.

"ఎవరికి పెళ్లిచూపులు?" – వెంటనే అడిగాడు.

"ఈ ఇంట్లో ముగ్గురం మనుషులం అఘోరిస్తున్నాం... ఒకటి నేను... రెండు మీ అమ్మ...! మా ఇద్దరికీ ముప్ఫయ్యేళ్ళ క్రితమే పెళ్ళయిందనటానికి సాక్ష్యంగా చెట్టంత కొడుకువి నువ్వున్నావ్!... నీక్కూడా మొన్న ఉగాది పండక్కి ఇరవై ఏడు వెళ్లి – ఇరవై ఎనిమిది అఘోరిచింది!.... నాకంటే చిన్న వాళ్లెందరో, ఏనాడో తాతల హోదా పొంది, వాళ్ళ మన వళ్ళ లీలావిలాసాల్ని చిలవలు పలవలుగా చెప్పుకుంటూంటే–నాకెంతో చిన్నతనంగా ఉంటోంది–"

తానింకా అలాగే నోరు తెరచి వింటూ నిలబడిపోతే, తండ్రి నోరు మరి మూత పడదని సాగర్‌కి తెలుసు... అందుకే ఆ 'పాయింటు' దగ్గర కల్పించుకుంటూ అన్నాడు –

'సర్లెండి! అర్థమైంది... సాయంత్రం బ్యాంకునించి పెంద్రాళే వస్తాన్లెండి!"–

ఇక మరోక్షణం అక్కడ ఉండకుండా బయటకు నడిచాడు సాగర్.

★ ★ ★

"ఆహా! విధి ఎంత విచిత్రమైందీ?" – అనుకున్నాడు సాగర్ ఆనందంతో ఆ క్షణాన.

ఇద్దరమ్మలక్కలు బాడీగార్డుల్లా వెంట రాగా, మణుగు మల్లెపూలు జడలో పెట్టుకున్న కారణాన, బరువెక్కిన తలను భూమిలోకి పంచుకుని, అడుగులో అడుగు వేసుకుంటూ, హంసగమనలా నడచి వచ్చి తన కెదురుగా చాపమీద పెళ్లికూతురు హోదాలో సిగ్గులమొగ్గయి కూర్చుని, అలవోకగా అరక్షణంసేపు తనవైపు చూపుసారించిన ఆ పిల్లను చూడగానే – మరుక్షణం, మనసులో అలా అనుకున్నాడు సాగర్...

ఎందుకంటే – ఆ అమ్మాయి 'పారిజాతం' కనుక!

సాగర్ 'బీకాం' ఫైనలియర్‌లోకి వచ్చినపుడు – పారిజాతం బి.ఎ. ఫస్టియర్‌లో చేరింది... ఆ తర్వాత పది రోజులకే కాలేజీ కుర్రాళ్ళ కలల్లో స్థానాన్ని సంపాదించుకుంది... అందుకే చాలామంది కుర్రాళ్లు రాత్రిపూట పుస్తకాలు తీసి చదవటం మానేసి – పెందరాళే భోంచేసి ఆపై ఓ నిద్రమాత్ర వేసుకుని మరీ పడుకునేవారు.. పడుకునే ముందు తమకు నిద్రలో కల రావాలనీ, ఆ కలలో పారిజాతం కన్పించి కవ్వించాలనీ – ఎవరి దేవుళ్ళను – వాళ్లు ప్రార్థించుకునేవారు.

అయితే, ఆ 'లెవెల్లో' కలవరించక పోయినా, కలల్ని వరించకపోయినా – సాగర్ కూడా పారిజాతం పట్ల రవంత అభిమానాన్ని పెంచుకున్నాడు... ఒకటి రెండుసార్లు ఆమెతో మాటలు పంచుకున్నాడు... తన డిగ్రీ అయిపోయిం తర్వాత కూడా – సెకెండియర్ చదువుతున్న పారిజాతాన్ని చూసేందుకని – వీలు చిక్కినపుడల్లా – 'కాలేజీ క్యాంపస్'కి వెడుతుండేవాడు... కొంత కాలానికి బ్యాంక్ ఉద్యోగం రావటంతో ఆ అవకాశం దూరమై – క్రమేపీ పారిజాతం తాలూకు ఆలోచనలు కూడా అతని 'మనసు పొరల' మాటుకి వెళ్లిపోయాయి...

మళ్లీ ఇంతకాలం తర్వాత, ఇలా హఠాత్తుగా తన ముందు ప్రత్యక్షమైన పారిజాతాన్ని చూడగానే 'ఇది కల కాదు కదా' అనే సందేహంతో, తన తొడమీద తనే ఓసారి గిల్లుకుని – అక్కడ నొప్పి పుట్టేసరికి అది కలకాదని నిర్ధారణ చేసుకున్నాడు సాగర్... అటుపై 'కాదు సుమా కలకాదు సుమా' అని మనసులోనే పాడుకున్నాడు.

మొత్తానికి పెళ్లి చూపుల తంతు విజయవంతంగా ముగిసింది.

"మేం ఇంటికి వెళ్లాక ఉత్తరం రాస్తాం!" – అన్నాడు సాగర్ తండ్రి పరబ్రహ్మం, అక్కణ్ణించి లేస్తూ.

"చిత్తం!... మా వైపునించి ఎలాంటి అభ్యంతరాలూ లేవు. మీ ఉత్తరం కోసం ఎదురు చూస్తుంటాం... మీ అబ్బాయికి మా అమ్మాయి నచ్చితే – నేను స్వయంగా వచ్చి తక్కిన విషయాలు మాట్లాడతాను" – అన్నాడు పారిజాతం తండ్రి పరంధామయ్య – వీధి గుమ్మం దాకా వచ్చి వాళ్లకు వీడ్కోలు పలుకుతూ...

ఇంటికి తిరగొచ్చాక, ఆ రాత్రి భోజనాల దగ్గర పరబ్రహ్మం ప్రారంభించాడు – "అమ్మాయి అణకువగానే కనిపించింది... బి.ఎ. ప్యాసయింది... పైగా సంప్రదాయమైన కుటుంబం.. వచ్చే నెలలో ముహూర్తాలున్నాయట... తమరు ఒప్పుకొంటే – వాళ్ళకు కబురు చేస్తాను... అసలు నా పెళ్లి, నా ఇరవై నాలుగో ఏట జరిగింది... నా ఇరవై ఆరో ఏట తమరు పుట్టి ఏడ్చారు.. అలాంటి తమరికిపుడు ఇరవై ఎనిమిది కూడా దాటిపోయింది... ఇంకా తాత్సారం చేస్తే – తమరిలో ఏదో లోపం అఘోరించిందని –"

తండ్రి వాక్ప్రవాహానికి అక్కడే అడ్డు కట్ట వేస్తూ చెప్పాడు సాగర్ –

"నాకు పిల్ల నచ్చింది... ముహూర్తం పెట్టించమని వాళ్లకి కబురు చేయండి!"

★★★

"అహో! విధి ఎంతటి విషాదాన్ని మిగులుస్తుందీ?" – అనుకున్నాడు సాగర్ ఆవేదనతో ఆ క్షణాన.

పారిజాతం తనకు నచ్చిందనీ, ముహూర్తం పెట్టించండంటూ ఉత్తరం రాయమనీ, సాగర్ తన తండ్రితో చెప్పిన తొంభై ఆరు గంటలకు తాంబూలాలు పుచ్చేసుకుని – సుముహూర్తం నిశ్చయించేశారు. నెల రోజులు తిరిగేసరికి, పెళ్లి పందిట్లో – పారిజాతం సరసన – తాను పెళ్లి పీటల మీద కూర్చున్నాడు.

అంతవరకూ అంతా సవ్యంగానే నడిచింది. తర్వాతే జరగరానిదీ, కలలో కూడా ఊహించలేనిదీ జరిగిపోయింది.

ఇంక కొద్ది నిమిషాల్లో మంగళసూత్రధారణ కావాల్సివుండగా, ఉన్నట్టుండి పారిజాతం స్పృహతప్పి – అక్కడే పక్కకు పడిపోయింది... పెళ్లి మంత్రాలు చదువుతున్న శాస్త్రిగారు నోరు తెరచి అలాగే చూస్తుండిపోయారు... 'పందిట్లో పెళ్లవుతున్నాదీ' – అనే పాటను వాయిస్తున్న సన్నాయిమేళం 'సైలెన్స'యిపోయింది... పందిట్లో కలకలం బయల్దేరింది. పెళ్లి చూసేందుకు వచ్చిన బంధుబలగంలోని ఓ లేడీ డాక్టరమ్మ – హుటాహుటిన వచ్చి పారిజాతాన్ని పరీక్షించింది... ఏదో ఇంజక్షన్ కూడా చేసింది... ఈలోగా ముహూర్తం కాస్తా దాటిపోయింది...

దిగ్భ్రాంతుడై జరిగిందేమిటో ఊహించుకోవటానికి ప్రయత్నిస్తున్నాడు సాగర్.

"కొంపతీసి అమ్మాయికి మూర్ఛరోగం ఉందో ఏం పాడో?" .... అమ్మలక్కల్లో ఒకామె పక్కామె చెవికొరికింది...

"అంతేనమ్మా!... దేవుడెప్పుడూ అలాగే చేస్తుంటాడు... లేకపోతే బంగారపు బొమ్మలాంటి పిల్లకు ఆ జబ్బేమిటీ?" – ఈమెగారి చెవిలో – ఆమెగారు ఊదింది...

మరుక్షణంలో పరబ్రహ్మం – మండపం దగ్గరకు సుడిగాలిలా దూసుకునివచ్చాడు.

"ఇంకా బడుద్ధాయిలా అక్కడే అఘోరిస్తావేమిట్రా?... లే...! మూర్ఛరోగిని నీకు కట్టబెట్టాలని పన్నాగం పన్నారు... మన అదృష్టం బావుండి ఆ మూడు ముళ్లూ పడకముందే వాళ్ళ బండారం బయటపడింది... ఇంకెందుకూ?.. లేచిరా!", – అంటూనే, తన చేయి పట్టుకుని పీటల మీదనించి సరాసరి విడిదిలోకి – అక్కణ్ణించి ఎకాఎకి ఇంటికీ లాక్కొచ్చాడు తండ్రి...

"విధి ఎంతో విషాదాన్ని కూడా మిగులుస్తుంద'ని - సరిగ్గా అప్పుడే అనుకున్నాడు సాగర్... 'కల చెదిరిందీ - కథ ముగిసిందీ' - అని కూడా మనసులో పాడుకున్నాడు...

అలా తనకు మిగిలిన విషాదాన్ని తనలోనే ఇముడ్చుకుని - కొన్నాళ్ళకు మనసుకుదుటపరచుకుని - 'మేరేజెస్ ఆర్ మేడిన్ 'హెవెన్' అనే సూక్తిని తలదాల్చుకుని - ఆర్నెల్ల తర్వాత అనురాధ మెడలో మూడు ముళ్లూ వేసి - ఓ ఇంటివాడయ్యాడు సాగర్...

★★★

ప్రధానమంత్రి వస్తున్నపుడో, రాష్ట్రపతి పర్యటిస్తున్నపుడో - రోడ్డుమీద ట్రాఫిక్ ఆగిపోవచ్చు. అలాగే గోడ గడియారంలో తిరుగుతున్న ముల్లు చెప్పాపెట్టకుండా ఆగిపోవచ్చు... ఏ జబ్బూ లేకుండా, ఏ వ్యాధీ రాకుండా, పిడిరాయిలా కనిపించే మనిషిగుండె ఉన్నపళాన ఆగిపోవచ్చు...

కానీ మనం ఆనందంలో మునిగి తేలుతున్నామనో, లేక మరెవరో కష్టాల్లో కూరుకుపోయారనో - 'కాలం' మాత్రం ఆగిపోదు...

పారిజాతం ఆక్రమించాల్సిన స్థలంలోకి అనూరాధ వచ్చింతర్వాత సాగర్ విషయంలో కూడా కాలం అలాగే ఆగిపోకుండా ముందుకు సాగిపోయింది. ..

తాను తాత కావటం అప్పటికే ఆలస్యమైపోయిందని కారాలూ మిరియాలూ నూరుతున్న తండ్రిని శాంతింపచేయాలన్న ఏకైక లక్ష్యంతో ఏడాది తిరిగేసరికల్లా అనూరాధను తల్లిని చేశాడు సాగర్... పండంటి మనవడికి ఆయనను తాతను చేశాడు.

ఓ పదేళ్ళపాటు మనవడితో ముద్దు ముచ్చటలు తీర్చుకున్నాక - పరబ్రహ్మం పరలోకానికి ప్రయాణమై వెళ్లిపోయాడు... అప్పటికీ అదేం పట్టనట్టుగా కాలం మరింత వేగంగా ముందుకు పరుగెత్తింది.

ఇపుడు సాగర్ తన తండ్రంతటి వాడయ్యాడు. అతని గిరజాల జుట్టు పూర్తిగా ఊడిపోయి, బట్టతల మిగిలింది. చెంపలపై, చెవుల పక్కనున్న జుట్టు వెండిరంగులోకి మారిపోయింది. ఉద్యోగంలోంచి రిటైరైన సందర్భంగా వచ్చిన ప్రావిడెంట్ ఫండు డబ్బుని తను పనిచేసిన బ్యాంకులోనే డిపాజిట్ చేసుకుని, దానిపై వచ్చే వడ్డీతో - సంసారాన్ని సునాయాసంగా నడుపుకొస్తున్నాడు...

ఈలోగా సాగర్ కొడుకు సారధి కూడా విద్యావంతుడయ్యాడు... తర్వాత ఉద్యోగస్తుడయ్యాడు. పాతికేళ్ళ క్రితం నాటికీ ఇప్పటికీ జనాభాలో స్త్రీల నిష్పత్తి గణనీయంగా పెరిగిన కారణంగా - అన్ని విధాలా ప్రయోజకుడైన సారధికి పెళ్లి సంబంధాలు రావటం మొదలైంది...

అలా వచ్చిన సంబంధాల్లో – తారకం గారిది కూడా ఒకటి!

"నాకు బొబ్బర్లంకలో అయిదెకరాల కొబ్బరితోటలున్నాయి... అక్కడి ఆంధ్రా బ్యాంకులో అయిదు లక్షల క్యాషుంది... మాకు ఒక్కగానొక్క కూతురు... పేరు సరస్వతి... బి.ఎ. చదివింది... పెళ్ళయ్యే వరకూ ఖాళీగా ఉండటం ఎందుకని – అదేదో కంప్యూటర్ కోర్స్‌లో చేరింది... నాకు మగపిల్లలు లేరు... మీ అబ్బాయి పెళ్ళికున్నాడని తెలిసింది... మీకు అభ్యంతరం లేకపోతే, మీ అబ్బాయితో సహా వచ్చి మా అమ్మాయిని చూసుకోండి" – అంటూ అతి వినయంగా ఆహ్వానించాడు తారకం.

ఆయనను చూసింతర్వాత – అసలు పెళ్ళిచూపులకంటూ వెళ్లి ఆ పిల్లను చూడటం అనవసరం అనుకున్నాడు సాగర్...

తారకం పొట్టిగా, నల్లగా తారుడ్రమ్ములా ఉన్నాడు. ఆయన కళ్లు లోతుగానూ, కనుబొమలు దట్టంగానూ ఉన్నాయి. సాధారణంగా ఆడపిల్లకి తండ్రి పోలిక వస్తుందంటారు కనుక – అప్పుడు ఆ పిల్లకి కూడా తండ్రి పోలికే వచ్చివుండాలి కనుక – తన కొడుక్కి ఎలాగా నచ్చదనుకున్నాడు... అయినా సభ్యత కోసం పెళ్లి చూపులకు వస్తా'మనే చెప్పాడు సాగర్.

★★★

"ఇది కలయా?... లేక వైష్ణవ మాయయా?" – అనుకున్నాడు సాగర్ ఆశ్చర్యంగా ఆ క్షణాన.

బంగారు రంగు పట్టుచీర కట్టుకుని – మెడలో సన్నని బంగారు గొలుసు వేసుకుని, జడలో ఒకే ఒక గులాబీ పువ్వు పెట్టుకుని – దేవకన్యలా మెరిసిపోతూ ఆ గదిలోకి వచ్చింది సరస్వతి... పెదవులపై చిరునవ్వులు చిందిస్తూ చేతులు జోడించి నమస్కరిస్తూ సారధికి ఎదురుగా కూర్చుంటున్న ఆమెను చూసిన మరుక్షణమే మనసులో అలా అనుకున్నాడు సాగర్.

పాతికేళ్ల క్రితం ఎపుడో తాను చూసిన పారిజాతం – అతని కళ్ళముందు ప్రత్యక్షమైన అనుభూతికి లోనయ్యాడు... అన్నీ – అచ్చుగుద్దినట్టుగా అవే పోలికలు!!

"ఒకవేళ ఆమె, పారిజాతం కూతురు కాదుకదా?" – అని కూడా అనుకున్నాడు సాగర్. ఎంతసేపైనా ఆ అనుమానం తీరే అవకాశం దొరకలేదతనికి... ఈలోగా పని కుర్రాడు కాబోలు –కాఫీ టిఫిన్లు తెచ్చి పెట్టాడు. వాటి పనిపడుతూనే కబుర్లలోకి దిగేరు పెద్దలు... సరస్వతీ సారధీ ఉండి ఉండి ఒకరినొకరు చూసుకుంటున్నారు.

"మా సరస్వతి అచ్చం వాళ్ళమ్మ పోలికేనండి!" - అన్నాడు తారకం మాటల సందర్భంలో.

"ఎవరి పోలికైతేనేమండీ? కల్యాణం వచ్చినా, కక్కొచ్చినా ఆగదనీ - ఎవరికెక్కడ రాసి పెట్టివుంటే అక్కడ కావాల్సిందే... తప్పుతుందా చెప్పండి అన్నయ్యగారూ!" అంది అనూరాధ కాబోయే కోడలి అందాన్ని మనసులోనే మెచ్చుకుంటూ.

"భేషయిన మాటన్నారు!.. మా పారిజాతం విషయంలో కూడా సరిగ్గా అలాగే అయింది... పారిజాతం నాకు అక్కకూతురేలెండి!... కానీ నేను పల్లెటూరి బైతుననీ, నల్లగా చింతమొద్దులా ఉంటాననీ, మా అక్కాబావా, నన్ను కాదని దానికి వేరే సంబంధం ఖాయపరిచారు... నాకపుడు ఒళ్లు మండిపోయింది... ఆ కోపంతోనే నేనా పెళ్లికి వెళ్ళటం మానేశాను... కానీ అనుకోకుండా పీటల మీద ఆ పెళ్లి కాస్తా ఆగిపోవటంతో ఆ తరవాత నేనే వాళ్లకి దిక్కయ్యాను" - హాయిగా నవ్వేస్తూ తారకం అలా చెప్తుంటే - తన కుర్చీలో ముళ్ళున్నట్టుగా ఇబ్బందిపడ్డాడు సాగర్.

"ఇంతకీ పీటలదాకా వచ్చిన ఆ పెళ్లి ఎందుకాగిపోయిందో?" - ఏమీ ఎరుగని వాడిలా అడిగాడు క్షణం తర్వాత.

"విధి విచిత్రం అంటే అదేనండీ! కొన్ని నిమిషాల్లో సూత్రధారణ జరుగుతుందనగా మా పారిజాతం హఠాత్తుగా స్పృహతప్పిపడిపోయింది... దాంతో మూర్ఛరోగం ఉందనే 'నింద' అంటగట్టి - పీటల మీద నించి పెళ్లి కొడుకుని లాక్కుపోయాట్ట అతని తండ్రి..."

"అయితే అప్పుడు మూర్ఛపోవటం..." అయోమయంగా చూస్తూ అడగబోయిన సాగర్‌ని వారిస్తూ మధ్యలోనే చెప్పాడు తారకం -

"అది మూర్ఛ కాదండీ బాబూ... అంతకు ముందురోజు రాత్రి మా పారిజాతం భోజనం చేయలేదట. దాంతో నీరసం వచ్చి, కళ్ళు తిరిగి పడిపోయిందట. మా పాతికేళ్ళ కాపురంలో మళ్లీ అదెప్పుడూ అలాపడిపోలేదులెండి... ఏదేమైతేనేం?... దాన్ని పెళ్లిచేసుకోటానికి మళ్లీ ఎవరూ ముందుకు రాలేకపోయారు... అపుడు మా అక్కాబావా వచ్చి నన్ను బతిమాలుకున్నారు..."

తారకం ఇంకా నవ్వుతూనే ఏదో చెప్పబోతూంటే - సారధి పక్కనే కూర్చుని వింటున్న అనూరాధ - ఒక చేత్తో కణతలు నొక్కుకుంటూ పక్కకు ఒరిగిపోయింది...

అది చూసిన సాగర్ గబగబా ఆమెను చేరుకుని - జేబులో ఉన్న తాళం చేతుల గుత్తి ఆమె గుప్పిట్లో పెట్టి - నెమ్మదిగా గ్లాసుడు మంచినీళ్లు తాగించాడు...

"అక్కయ్యగారికేమైందీ?" ఆతృతగా అడిగాడు తారకం...

"మరేం కంగారులేదులెండి... ఈ మధ్య అపుడపుడు 'ఫిట్స్'లాగా వచ్చి ఇలాగే పడిపోతుంటుంది... మళ్లీ రెండు నిమిషాల్లో మామూలైపోతుంది" - అన్నాడు సాగర్.

అన్నట్టుగానే రెండు నిమిషాల్లో కళ్లు తెరచి - ఈ లోకంలోకి వచ్చింది అనూరాధ...

ఈ హడావిడికి కంగారుపడి లోపల్నించి పరుగెత్తుకుంటూ వచ్చిన పారిజాతానికి తన ముఖం కనిపించకుండా జాగ్రత్త పడ్డాడు సాగర్...!!

(ఆదివారం, ఈనాడు
25-8-1999)

★★★

## ప్రతిభకు, స్నేహానికి సంకేతం జీడిగుంట...

జీడిగుంట రామచంద్రమూర్తి సాహిత్యరంగంలో మూడు దశాబ్దాలు పైగా విశేషమైన కృషి చేశారు. కథ, నాటకం ప్రక్రియల్లో రామచంద్రమూర్తి ప్రతిభ ప్రశంసనీయం. ఆలిండియా రేడియాలో ఉద్యోగం చేస్తూ, సాహిత్యరంగంలో కృషి జరపటం ముదావహం. జీవితంలో ఉద్యోగం చేసే వ్యక్తులు అరుదుగా తమకాలం కాళారంగంలో వినియోగించటం కనిపిస్తుంది. రామచంద్రమూర్తి రచనా రీతిలో కథ వ్రాసినా - నాటకం వ్రాసినా ఒక స్పష్టత, లక్ష్యం కనిపిస్తాయి. సునిశిత హాస్యం కూడా తొణికిసలాడుతూంటుంది. ఆధునికకాలంలో హాస్యం వ్రాయగలిగే రచయితలు చాలా కొద్ది మంది మాత్రమే. అందులో జీడిగుంట రామచంద్రమూర్తికి ఒక ప్రత్యేకస్థానం ఉందంటే అతిశయోక్తి కాదు.

**పోతుకూచి సాంబశివరావు**
అధ్యక్షులు
అఖిల భారత తెలుగు రచయితల మహాసభ
5-12-1991